
క్లుప్తంగా

జీరో బిల్లుకు దూరం



నర్సాపూర్(జి): గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ పథకం వర్తిస్తుంది. మండల కేంద్రంలో 30 రోజులకు రావాల్సిన విద్యుత్ బిల్లును 36 రోజులకు అందించడంతో వినియోగదారులు గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లుకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి 30 రోజుల్లో విద్యుత్ బిల్లులు వినియోగదారులకు అందేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన మచ్చ నాగచైతన్య అనే 8వ తరగతి విద్యార్థి ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కరాటే పోటీల్లో రెండు గోల్డ్‌మెడల్స్ సాధించడంతో సోమవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఫస్ట్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ 2024, కరాటే, తైక్వాండోతో పాటు కుంగ్‌ఫు చాంపియన్‌షిప్ పోటీలు ఇటీవల కోట్లవిజయబాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరగ్గా ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. కరాటే మాస్టర్ మనోహర్, హెచ్ఎం జీఎల్‌వీ ప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: 11కేవీ ఫస్ట్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. పాత బస్టాండ్, పాత అశోక్ థియేటర్, రాయల్ బిల్డింగ్ ఏరియా, చింతకుంటవాడ ప్రాంతాలలో ఉదయం 7.30 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీడీసీ చొరవతో ట్రావిస్ స్టాండ్ ఏర్పాటు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలో సోమవారం గ్రామ వీడీసీ చొరవతో పశువులకు చికిత్స చేసే సమయంలో వినియోగించే ట్రావిస్ స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. గ్రామస్తులు గోపు రత్నం, బాల్యల శ్రీనివాస్, పెద్ది నర్సయ్య, గాండ్ల శ్రీను, బోసు భూమన్న, నగేశ్, రమణానంద, గుండేటి హరీశ్ తదితరులు ఉన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

కుభీర్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో నాన్ టీచింగ్ (2 వాచ్‌మెన్, 1 అటెండర్, 1 స్కావెంజర్) పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను సోమవారం అధికారులు పరిశీలించారు. మొత్తం 4 పోస్టులకు 84 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ ఎం.సోము, ఎంపీడీవో మోహన్‌సింగ్, ఎంఈవో చంద్రకాంత్ ఉన్నారు.

గొర్రెలతో వలస..!



గొర్రెలతో వలస వెళ్తున్న కాపరులు

కుంటాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో లోకేశ్వరం మండలంలోని రాజురా, బామ్ని, పంచగుడి తదితర పరీవాహక ప్రాంతాల్లో శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ చేరింది. దీంతో పశువులకు, గొర్రెలకు మేత అందుబాటులో లేకపోవడంతో అక్కడి కాపర్లు గొర్రెలతో ఆదివారం కుంటాల మండలానికి చేరుకున్నారు. అక్కడ వరద ఉధృతి తగ్గే వరకు మండలంలోని దౌనెల్లి అటవీ ప్రాంతంలో మూడునెలల పాటు జీవాలను మేపుతామని వారు 'సాక్షి'తో తెలిపారు.

ఘనంగా కాళోజీ జయంతి

జిల్లా వ్యాప్తంగా సోమవారం కాళోజీ నారాయణరావు జయంతి పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన తెలుగు భాషకు చేసిన సేవలను కొనియాడారు. కాళోజీ కవిగా తన కవితలతో ఉద్యమాన్ని నడిపాడని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.



భైంసారూరల్: చుచుంద్ ప్రాథమిక పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అక్షరయోధుడు కాళోజీ

నిర్మల్‌ఖిల్లా: నిరంతరం తెలంగాణ భాష అస్తిత్వం కోసం తన రచనలతో సమాజాన్ని చైతన్యవంతం చేసిన అక్షరయోధుడు కాళోజీ నారాయణరావు అని పలువురు వక్తలు కొనియాడారు. తెలంగాణ రచయితల వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్మల్ నర్సింగ్ హోమ్‌లోని దామెర సాహితీక్షేత్రంలో కాళోజీ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం తెలంగాణ ప్రాంతీయ భాషా దినోత్సవం జరుపుకున్నారు. వక్తలు డాక్టర్ దామెర రాములు, డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, పత్తి శివప్రసాద్ మాట్లాడుతూ కాళోజీ ధిక్కార స్వరంతో నైజాం సర్కారుకు ఎదురొడ్డి పోరాడిన యోధుడని, ప్రజల వాడుక భాషలో కవిత్వాన్ని రాసిన ప్రజాకవి అని, ప్రాంతీయ భాషకు ప్రాణం పోసిన తెలుగు తేజమని అన్నారు. తెరవే అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, కోశాధికారి పోలీస్ భీమేష్, సభ్యులు కుమ్మరి నాగారం పాల్గొన్నారు.



నిర్మల్‌టౌన్: పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్



తానూరు: ఎల్వి పాఠశాలలో..



ఖానాపూర్: పాల్గొన్న అధ్యాపకులు



నిర్మల్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



మామడ: కొరిటికల్ పాఠశాలలో..



లోకేశ్వరం: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



లక్ష్మణచాంద: నివాళులర్పిస్తున్న సిబ్బంది



నిర్మల్‌ఖిల్లా: నివాళులర్పిస్తున్న సభ్యులు



సోన్: జాఫ్రపూర్ ఉన్నత పాఠశాలలో..



సారంగపూర్: జామ్ గురుకులంలో..



ముధోల్: బాలికల ఉన్నత పాఠశాలలో..



కడెం: జెడ్పీ పాఠశాలలో..



కుంటాల: ఆదర్శ పాఠశాలలో..



భైంసాటౌన్: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

గణనాథుడికి పూజలు



తానూరు: హారతి కార్యక్రమానికి హాజరైన భక్తులు



కొలువుదీరిన ఎకో ఫ్రెండ్లీ పేపర్ గణపతి

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో ఏర్పాటు చేసిన కర్ర గణేశుడికి పెద్దఎత్తున భక్తులు పూజలు చేస్తున్నారు. సోమవారం తెలంగాణ జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్, భోకర్, ధర్మబాద్‌తోపాటు తదితర గ్రామాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో చేరుకొని పూజలు చేశారు. భక్తులు మొక్కులు చెల్లించుకుని ముడుపులు కట్టారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం రాత్రి భైంసా పట్టణానికి చెందిన యోగేశ్ కళా బృందం భక్తి గీతాలపై నృత్యాలు ప్రదర్శించారు. గౌరవ అధ్యక్షుడు నాగనాథ్, అధ్యక్షుడు మురళి, కమిటీ సభ్యులు ఉన్నారు.

ఖానాపూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పలు మండపాల్లో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని భాగ్యనగర్ మండపంలో నిర్వాహకులు అన్నదానం చేశారు. పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలోని గరుడసేన గణేశ్ మండలిలో ఓకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

దుబాయ్‌లో పూజలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుబాయ్‌లోని జెబల్‌అలీ ప్రాంతంలోని లాల్‌క్యాంపులో నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన గల్ఫ్ కార్మికులు దాతలు వినయ్, ముత్యంల సహకారంతో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రతీరోజు ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామంలో శ్రీరామసేన యూత్ గణేశ్ మండపం వద్ద సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఎకో ఫ్రెండ్లీ పేపర్ గణపతి..

మండల కేంద్రానికి చెందిన సబ్బన్ సాయికృష్ణ అనే యువకుడు ఎకో ఫ్రెండ్లీ పేపర్ గణపతి విగ్రహాన్ని తయారు చేసి అందరికి ఆదర్శంగా నిలిచాడు. జూనియర్ ఆదర్శ యూత్ యువకుల సహాయంతో గత 15 ఏళ్లుగా పర్యావరణానికి హాని కలగకుండా మట్టి, నవధాన్యాలు, పసుపు, పేపర్‌లతో గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నారు. స్థానిక పెద్ద హనుమాన్ ఆలయ ఆవరణలో పేపర్ గణపతిని ప్రతిష్ఠించారు. పలువురు పూజలు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

భైంసాటౌన్: పట్టణంలోని పలువురికి మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం 13 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించారు. బాసర, నర్సాపూర్ మండలాలల్లో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన ప్రొసిడింగ్ కాపీలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఫారూక్ అహ్మద్, ఎజాస్‌ఖాన్, రసూల్, సాబీర్, ఆసిఫ్ తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామస్తులకు నీటి వసతి కోసం రూ.లక్ష ప్రొసిడింగ్ కాపీని సోమవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అందించారు. ఎస్టీ కమ్యూనిటీ హాల్‌లో నీటి వసతి కోసం ఎదురవుతున్న ఇబ్బందులపై గతంలోనే సుంక్లి గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇచ్చిన రూ. లక్ష ప్రొసిడింగ్ కాపీని దేగాంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి గ్రామస్తులకు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డి, హరీశ్, గ్రామస్తులు ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామ ఎస్టీ సంఘ భవనానికి రూ.2లక్షలు, పద్మశాలి సంఘ భవనానికి రూ.3 లక్షలు, ఖబ్రస్తాన్ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.4 లక్షలు, బూరుగుపల్లి (జి) గ్రామ ఎస్టీ సంఘ భవన నిర్మాణానికి రూ.4 లక్షల నిధులు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన ప్రొసిడింగ్ కాపీలను సోమవారం గొల్లమాడ, బూరుగుపల్లి (జి) గ్రామస్తులకు ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అందజేశారు.

భూమిపూజ

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ఎంపీడీవో రాధ ప్రారంభించారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో మురుగు నీరు నిల్వ కాకుండా ఉండటానికి గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రెండు ఇంకుడు గుంతలు నిర్మించేందుకు ఎంపీడీవో సోమవారం భూమిపూజ చేశారు. అలాగే హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని వసతిగృహం వార్డెన్ అజయ్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ఆహీర్‌ఖాన్, టీఏ దినేశ్, ఈసీ, పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న అధికారులు

షీటీం సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీం సిబ్బంది

నిర్మల్‌టౌన్: ఎవరైనా వేధిస్తే ఆందోళన చెందకుండా మహిళలు డయల్ 100కు కాల్ చేయాలని షీటీం పోలీసులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు షీటీం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు.

పీఆర్‌టీయూ కార్యవర్గం ఎన్నిక

ముధోల్: మండల నూతన పీఆర్‌టీయూ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి. ప్రవీణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.ఏ అహ్మద్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.వసంత్‌రావు, మహిళ ఉపాధ్యక్షులుగా కే.యోగిత, కార్యదర్శిగా బి. శ్రీనివాస్, సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి సభ్యులు అభినందనలు తెలిపి సన్మానించారు.

పోలీసుల పెట్రోలింగ్

బాసర: మండల కేంద్రంలో గణేశ్ ఉత్సవాలు పురస్కరించుకొని పోలీసులు అర్ధరాత్రి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాత్రి సమయంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ గణేశ్ మండపాల కమిటీ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నారు. గాదె హనుమాన్ ఆలయం వద్ద గల బాల వీర గణేశ్ మండలి నిర్వాహకులకు భద్రతపై పలు సూచనలు, సలహాలు అందజేశారు.

ఒకరి రిమాండ్

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామపంచాయతీ చెత్త ట్రాక్టర్ బ్యాటరీని జూన్ 26 రాత్రి గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడు. మరునాడు పంచాయతీ కార్యదర్శి నరేశ్ కుమార్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై హన్మాండ్లు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మహారాష్ట్ర హిమాయత్ నగర్‌కు చెందిన ఓ యువకుడు దొంగిలించినట్లు విచారణలో వెల్లడి కాగా సోమవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుల శ్రమదానం

బాసర: మండలంలోని బిద్రెల్లి గ్రామం నుంచి ధర్మాబాద్‌కు వెళ్లే రోడ్డుపై అనేక గుంతలు ఏర్పడగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బిద్రెల్లి గ్రామానికి చెందిన వీర్ గణేశ్ మండలి యువకులు తమ సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు ముందుకొచ్చారు. గుంతలలో కాంక్రీట్, డస్ట్ పోసి గుంతలను పూడ్చి వేశారు. దీంతో యువకులను గ్రామస్తులు అభినందించారు.



గుంత పూడుస్తున్న యువకులు

స్పందించి.. ఆస్పత్రికి తరలించి

నర్సాపూర్(జి): ఆర్టీసీ బస్ డ్రైవర్, కండక్టర్ సకాలంలో స్పందించడంతో ఓ విద్యార్థికి ప్రాణపాయం తప్పింది. సారంగాపూర్ మండలం బోరిగాం తండా గ్రామానికి చెందిన కిరణ్ నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఇటీవల వరుసగా సెలువులు రావడంతో ఇంటికెళ్లాడు. సోమవారం కిరణ్ తన తల్లితో కలిసి నిర్మల్ నుంచి ఆర్టీసీ బస్సులో నర్సాపూర్(జి) ఆశ్రమ పాఠశాలకు బయలుదేరాడు. దిలావర్పూర్‌కు చేరుకోగానే కిరణ్ ఛాతిలో నొప్పిరావడంతో పక్కనే ఉన్న అతడి తల్లి బస్ కండక్టర్ గంగాధర్‌కు చెప్పింది. కండక్టర్ డ్రైవర్ గంగాధర్‌కు తెలపడంతో వెంటనే అదే బస్సులో విద్యార్థిని నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విధుల్లో ఉన్న పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ విజయానంద్ విద్యార్థికి వెంటనే ప్రథమ చికిత్స అందించారు. అనంతరం 108 వాహనంలో అక్కడి నుంచి నిర్మల్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ కోలుకుంటున్నాడు. సకాలంలో స్పందించిన బస్సు కండక్టర్, డ్రైవర్‌ను ప్రయాణికులు అభినందించారు.



విద్యార్థికి చికిత్స చేస్తున్న డాక్టర్ విజయానంద్

గంగాపూర్ వంతెన నిర్మాణానికి కృషి

కడెం: గంగాపూర్ వంతెన నిర్మాణం పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని గంగాపూర్ ఉమ్మడి గ్రామ పంచాయతీలో పర్యటించారు. కడెం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో అసంపూర్తిగా నిలిచిన వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. వంతెన రీ డిజైన్ చేసి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, ముడికే మల్లేశ్, గొళ్ల వెంకటేశ్, శంకర్, భూమేశ్, భూషణ్, చక్రపాణి, రమేశ్, తదితరులు ఉన్నారు.



వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

కోతకు గురైన రోడ్డు

మామడ: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా న్యాలింగంపల్లి నుంచి కొరిటికల్ గ్రామానికి వెళ్లే రోడ్డు కోతకు గురైంది. రోడ్డు సమీపంలోని వరి పొలాల నుంచి వరద కారణంగా ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. రోడ్డు కోతకు గురికావడంతో బస్సు సౌకర్యం నిలిచిపోయింది. దీంతో న్యాలింగంపల్లి నుంచి కొరిటికల్ గ్రామానికి విద్యార్థులు, ప్రజలు కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గుంతను పూడ్చి, బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వర్షాల కారణంగా కోతకు గురైన రోడ్డు